## క్లుప్తంగా

### క్రీడలతో మానసికోల్లాసం

ఇచ్ఛాపురం రూరల్: క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని వైస్ ఎంపీపీ దున్న గురుమూర్తి అన్నారు. యువజనోత్సవాలు సందర్భంగా రాధాకృష్ణ యువజన సంఘం ఆధ్వర్యంలో మండలంలోని బూర్జపాడులో జిల్లాస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు ఇటువంటి క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో యువజన సంఘం అధ్యక్షుడు దున్న శ్రీను, నాయుడు దున్న ఆనంద్, శివంగి గణపతి, కీలు ఉమాశంకర్ పాల్గొన్నారు.

### క్యాలెండర్ ఆవిష్కరణ

ఇచ్ఛాపురం రూరల్: ఉపాధ్యాయుల సమస్యలపై ఆపస్ సేవలు వెలకట్టలేనివని ఎంఈవో కురమాన అప్పారావు అన్నారు. మండల విద్యావనరుల కేంద్రంలో ఆపస్ 2023 డైరీ, క్యాలెండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ కీలు సోమేశ్వరరావు, మండల అధ్యక్షుడు బి.శంకరం, ప్రధాన కార్యదర్శి తారకేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు రాజు, మోహనరావు, వాసు తదితరులు పాల్గొన్నారు.

### నూతన కార్యవర్గం ఎన్నిక

కంచిలి: జై భీమ్ సేన కంచిలి మండల శాఖ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు నగిరి మోహనరావు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. మండల శాఖ అధ్యక్షునిగా ఇప్పిలి ధర్మారావు, ప్రధాన కార్యదర్శిగా దూసి నారాయణమూర్తి, కోశాధికారిగా జర్జాన భగవతి, మహిళా సభ్యురాలిగా నగిరి సుజాతను ఎన్నుకున్నారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేస్తామని అధ్యక్షుడు ఇప్పిలి ధర్మారావు తెలియజేశారు.

### ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



పింఛన్ అందజేస్తున్న వలంటీర్ కవిత

సోంపేట: మండలంలోని పాలవలస గ్రామానికి చెందిన గ్రామ వలంటీర్ కవితా కరో శ్రీకాకుళం వెళ్లి గ్రామానికి చెందిన పింఛనుదారుకి శుక్రవారం పింఛన్ అందజేసింది. గ్రామానికి చెందిన తోట పార్వతి అనారోగ్యంతో రాగోలు జెమ్స్‌లో చికిత్స పొందుతోంది. అయితే పింఛన్ గడువు ముగుస్తుండంతో వలంటీర్ తన సొంత ఖర్చులతో శ్రీకాకుళం వెళ్లి పింఛన్ అందజేసింది. ఆమెను సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

### పెన్షనర్ల సమావేశం నేడు

మందస: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమావేశాన్ని స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో శనివారం నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గుంట కేశవరావు, వాయలపల్లి నారాయణరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 9 గంటలకు సమావేశం నిర్వహించబడుతుందన్నారు. లైఫ్ సర్టిఫికెట్ల సమర్పణ, ఆధార్ కార్డు నంబర్ లింక్ చేయబడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని పెన్షనర్లు ఉపయోగించుకోవాలని సూచించారు.

### సమస్యల పరిష్కారానికి కృషి

టెక్కలి: నియోజకవర్గం పరిధిలోని లైటింగ్ అండ్ సౌండింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు కె.సుధాకర్ తెలిపారు. పట్టణంలోని ఆయా యజమానులు, కార్మికులతో శుక్రవారం సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. దీనిలో భాగంగా ఉపాధ్యక్షులుగా అప్పలరాజు, కార్యదర్శిగా మురళీకృష్ణ, సహాయ కార్యదర్శిగా కె.కోదండం, కోశాధికారిగా జె.రామ్‌జీ తదితరులతో పాటు 400 మంది సభ్యులతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

### క్రమశిక్షణ చర్యలు తప్పవు

ఇచ్ఛాపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న చెత్త సంపద కేంద్రాల నిర్మాణంలో అలసత్వం ప్రదర్శిస్తున్న మండల ఉపాధి సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని ఎంపీడీవో కె.రామారావు హెచ్చరించారు. మండలంలోని తేలుకుంచి, హరిపురం, కొళిగాం, తులసిగాం, ధర్మపురం, కొఠారీ పంచాయతీల్లో చెత్త సంపద కేంద్రాల నిర్మాణాల్లో ఎటువంటి పురోగతి లేకపోవడంతో క్షేత్రసహాయకులు, టీఏ, ఏపీవో శ్రీనివాసరావులకు క్రమశిక్షణ చర్యల్లో భాగంగా చార్జ్ మెమోలు జారీ చేస్తున్నట్లు శుక్రవారం తెలిపారు.

### సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 5వ వార్డు తాళభద్ర కాలనీలో రూ.25 లక్షల నిధులతో సీసీ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులకు మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు శుక్రవారం శంకుస్థాపన చేశారు. కౌన్సిలర్ కర్రి మాధవరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మార్పు యుగంధర్, నారాయణరావు, డబ్బీరు సురేష్, అప్పారావు, నీలకంఠం, వెంకట్రావు, సుబ్బుస్వామి, రామారావు, బమ్మిడి శశి పాల్గొన్నారు.

### అప్రమత్తత అవసరం

కోటబొమ్మాళి: గ్రామాల్లో పశువులకు వ్యాపిస్తున్న వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్ధకశాఖ ఏడీ ఎం.లోకనాథం అన్నారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో పశువ్యాధులపై పాడి రైతులతో అవగాహన సమావేశం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ ఈవో యోగేశ్వరరావు, సర్పంచ్ కాళ్ల సంజీవరావు, వెటర్నరీ సహాయకులు ఎస్.శాంతారావు, వి.భానోజీరావు తదితరులు పాల్గొన్నారు.

## ● ఆదర్శనీయం



మున్సిపాలిటీ పరిధిలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఆదర్శనీయంగా నిలిచారు. విద్యార్థులంతా కలిసి ఫ్లాగ్ డే ఫండ్‌కి రూ.4 వేలు అందజేసి దేశభక్తి చాటుకున్నారు. పాఠశాల ఆవరణలో ప్రిన్సిపాల్ జి.శివప్రసాద్ ఆధ్వర్యంలో మాజీ సైనిక ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యదర్శి డి.విశ్వనాథం రెడ్డికి విరాళాన్ని శుక్రవారం అందజేశారు. ఫండ్‌ని జిల్లా సైనిక వెల్ఫేర్ బోర్డుకి అందజేయాలని కోరారు.

\- ఇచ్ఛాపురం

## ● ఆందోళనకరం



జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ జాగ్రత్త చర్యల విషయంలో కొంతమంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. లారీలో నిండుగా వెళ్తున్న ఊక లోడుపై ఇలా కొంతమంది కార్మికులు ప్రయాణిస్తున్న చిత్రం సాక్షి కెమెరాకు చిక్కింది. వీరు ఏమాత్రం పట్టుతప్పినా ప్రాణాలకే ప్రమాదం ఏర్పడుతుదని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు.

\- టెక్కలి

## ● ఆనందం



ఈ ఏడాది సక్రమంగా పంటలు చేతికందడంతో ప్రభుత్వ సాయంతో ట్రాక్టర్లపై వరిపంటను మిల్లులకు రైతులు ఆనందంగా తరలిస్తున్నారు. దీనిలో భాగంగా పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో మొగిలిపాడు గ్రామం వద్ద ధాన్యం తరలిస్తున్న ట్రాక్టర్లు బండెనక బండిగా వెళ్తూ ఇలా కనిపించాయి. దీంతో అక్కడ సందడి వాతావరణం నెలకొంది.

\- కాశీబుగ్గ

# పింఛన్ల పండగ



మందస: పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ దానయ్య

● కొనసాగుతున్న కొత్త పింఛన్ల పంపిణీ

మందస: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట తప్పని వ్యక్తి అని ఎంపీపీ డొక్కరి దానయ్య, జెడ్పీటీసీ సవర చంద్రమ్మ అన్నారు. మండలంలోని కొండపుట్టి, మేజరు పంచాయతీ మందసలో కొత్తగా మంజూరైన పింఛన్లను శుక్రవారం పంపిణీ చేశారు. సర్పంచ్ చెరుకుపల్లి యల్లమ్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు సీర ప్రసాద్, కొర్నాని ఆదినారాయణ, ఎంపీటీసీలు కంచి బెహరా, హరినారాయణ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చెరుకుపల్లి లక్ష్మణమూర్తి, యర్రగుంట్ల కృష్ణమోహన్, బరాటం జయప్రకాశ్, మట్ట ఆనందరావు, కురాగౌడ, నాగేశ్వర బృందావన్, పంచాయతీ ఈవో ఎ.వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు రూరల్: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జనరంజక పాలన అందిస్తున్నారని సర్పంచ్ గూడ గిరిజ అన్నారు. మండలంలోని గరుడభద్రలో నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గూడ ఈశ్వరరావు, సచివాలయ కన్వీనర్ అర్జి దానేష్, బూత్ కన్వీనర్ చెల్లూరి ధనరాజు, ఆనందరావు, కూర్మారావు పాల్గొన్నారు.



కోటబొమ్మాళి: పింఛన్ మంజూరు పత్రం అందజేస్తున్న జెడ్పీటీసీ వెంకటరమణారావు

కోటబొమ్మాళి: మండలంలోని కొత్తపల్లిలో కొత్త పింఛన్లను జెడ్పీటీసీ దుబ్బ వెంకటరమణారావు శుక్రవారం పంపిణీ చేశారు. అనంతరం దేశిల్ల రమణమ్మ, సత్తు సుజాతకు మంజూరైన వైఎస్సార్ బీమా సొమ్ము అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బొమ్మాళి రాము, వార్డు సభ్యుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పేదలు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారని జెడ్పీటీసీ పాల వసంతరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నూతనంగా మంజూరైన పింఛన్లను ఎంపీపీ మెరుగు రాజేశ్వరితో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నక్క చింతామణి, పీఏసీఎస్ అధ్యక్షుడు కెల్లి జగన్నాయకులు, ఎంపీడీవో ఉమాసుందరి తదితరులు పాల్గొన్నారు.



వజ్రపుకొత్తూరు రూరల్: గరుడభద్రలో పింఛన్లు అందజేస్తున్న దృశ్యం



సంతబొమ్మాళి: పింఛన్లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ వసంతరెడ్డి, ఎంపీపీ రాజేశ్వరి తదితరులు

వీరగున్నమ్మ సాహసం..

# భావితరాలకు ఆదర్శం



మందస: కేక్ కట్ చేస్తున్న దృశ్యం

మందస: సిక్కోలు పోరుగడ్డ ధీరవనిత వీరగున్నమ్మ జీవితం భావితరాలకు ఆదర్శమని తహసీల్దార్ బడే పాపారావు, ఎంపీడీవో వాయలపల్లి తిరుమలరావు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చింతాడ శరత్‌బాబు, యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ గుంట కోదండరావు అన్నారు. విప్లవసేనాని వీరగున్నమ్మ సినిమా రిలీజ్ సందర్భంగా మందసలోని మహేంద్ర థియేటర్ వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. సాసుమాన గున్నమ్మ మందస మండలంలోని వీరగున్నమ్మపురం(గుడారిరాజమణిపురం)లో సామాన్య, పేదరైతు కుటుంబంలో జన్మించిందన్నారు. నిండు గర్భిణీగా ఉన్న సమయంలోనే బ్రిటిష్ పాలకులపై కత్తిదూసిన వీరవనిత గున్నమ్మ అన్నారు. మరుగున పడిపోతున్న ఆమె చరిత్రను సినిమా రూపంలో నేటి తరానికి అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. చిత్రాన్ని ప్రతి ఒక్కరూ ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఆర్‌ఐ సవర చిన్నారావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, వీరగున్నమ్మపురం, కుంటికోట, మఖరజోల సర్పంచ్‌లు కర్రి గోపాలకృష్ణ, దుంపల వైకుంఠరావు, బమ్మిడి ధర్మారావు, ఎంపీటీసీ వాయలపల్లి మాధవరావు, కో-ఆప్షన్ సభ్యుడు యవ్వారి నాగేశ్వరరావు, శిస్టు బాపూజీ, సవర రామారావు, అధ్యాపకులు జి.రమణమూర్తి, బొడ్డు ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**సినిమా నటుల సందడి**

టెక్కలి: మండలంలోని ధర్మనీలాపురం గ్రామానికి చెందిన గూన అప్పారావు దర్శకత్వంలో తెరకెక్కిన విప్లవ సేనాని వీరగున్నమ్మ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ నేపథ్యంలో సినిమాలో నటించిన టెక్కలి మండలానికి చెందిన నటీనటులంతా స్థానిక భవానీ థియేటర్ వద్ద సందడి చేశారు. వీరగున్నమ్మ సినిమాలో కథానాయకునిగా నటించిన ధర్మనీలాపురం గ్రామానికి చెందిన గూన భరద్వాజ్‌తో పాటు టెక్కలికి చెందిన ప్రజా చైతన్య కళా సమితి సభ్యులు డి.ఎ.స్టాలిన్, ఎం.తాతయ్య, ఎం.పద్మనాభరావు, యు.గణపతిరావు, బి.కృష్ణారావు తదితరులు థియేటర్ వద్ద కేక్‌కట్ చేశారు. పలువురు ప్రజా సంఘాల నాయకులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు నటీనటులకు శుభాకాంక్షలు తెలిపారు.

కాశీబుగ్గ: విప్లవ సేనాని వీర గున్నమ్మ చిత్రం రిలీజ్ సందర్భంగా పలాసలో శ్రీవేంకటేశ్వర థియేటర్ వద్ద చిత్ర యూనిట్‌తో కలిసి మంత్రి సీదిరి అప్పలరాజు కేక్ కట్ చేశారు. అనంతరం బాక్స్ ఆఫీసు వద్ద టికెట్ కొనుగోలు చేసి సినిమా చూశారు.



టికెట్ కౌంటర్ వద్ద మంత్రి సీదిరి అప్పలరాజు

# ఆటో కార్మికుల ఆనందం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి కాశీబుగ్గ కాటమ్మతల్లి ఆటో యూనియన్ సభ్యులు పలు సమస్యలను మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు శుక్రవారం విన్నవించారు. దీనికి ఆయన స్పందించి ఆటో కార్మికుల సమస్య పరిష్కారంతో పాటుగా, ఆటోలు నిలుపుదలకు స్థలాన్ని సైతం ఖరారు చేయడంపై వారు ఆనందం వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు, మండల విప్ గండు మోహన్‌రావు, అధ్యక్షుడు రాఘవ, సభ్యులు ఢిల్లీరావు, శ్రీను, మోహన్, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# 'బెంతు ఒరియాలను ఎస్టీలుగా గుర్తించండి'

కవిటి: జిల్లాలోని ఇచ్ఛాపురం నియోజకవర్గం పరిధిలో దశాబ్దాల కాలంగా ఆర్థికంగా తీవ్ర వెనుకబాటులో ఉన్న బెంతు ఒరియా కులాన్ని ఎస్టీలుగా గుర్తించాలని ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ కోరారు. మండలంలోని మాణిక్యపురం, బల్లిపుట్టుగ పంచాయతీల్లో బెంతు ఒరియా కులస్తుల జీవన స్థితిగతులను పరిశీలించేందుకు ఏకసభ్య కమిషన్ సభ్యుడు ఐ.శామ్యూల్ ఆనంద్‌కుమార్, సీతంపేట ఐటీడీఏ పీవో డా.బి.నవ్య తదితరులు శుక్రవారం విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయా కుటుంబాలతో మాట్లాడి స్థితిగతులు తెలుసుకున్నారు. ప్రస్తుతం కుల ధ్రువీకరణ లేకపోవడంతో విద్య, ఉద్యోగ, సామాజికంగా తమ పిల్లలు అన్యాయానికి గురవుతున్నామని కమిషన్ దృష్టికి ఆ కులస్తులు తీసుకొచ్చారు. అందువలన బెంతొరియాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పిరియా సాయిరాజ్ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పలాస ఆర్డీవో టి.సీతారామ్మూర్తి, డిప్యూటీ తహసీల్దార్ పడాల రామచంద్రరావు, వైఎస్సార్‌సీపీ నేతలు కడియాల ప్రకాష్, పూడి నేతాజీ, పీఎం తిలక్, వై.నీలయ్య, బెంతు ఒరియా సంఘం నేతలు దేవరాజ్‌సాహూ, శివబిసాయి, రజనీకుమార్ దొళాయి, సంతోష్ సాహూ, బృందావన్ దొళాయి తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న పిరియా సాయిరాజ్

# ట్యాబ్‌ల పంపిణీ

కవిటి: మండలంలోని కొత్త కొజ్జీరియా ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను హెచ్‌ఎం మురపాల జగన్నాథం ఆధ్వర్యంలో సర్పంచ్ ఉప్పాడ నీల శుక్రవారం పంపిణీ చేశారు. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు ట్యాబ్‌లు పంపిణీ చేయడం శుభపరిణామమని వైఎస్సార్‌సీపీ నేత పిట్ట దేవేంద్రరెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఉప్పాడ పద్మనాభం, గణపతి, సిబ్బంది బాగా చలపతి, నిరంజన్ ఖడంగా తదితరులు పాల్గొన్నారు.



ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ నీల

# ఉత్సాహంగా క్రీడా పోటీలు

కాశీబుగ్గ: పలాస క్రీడా మైదానంలో శ్రీకాకుళం నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో ఉత్సాహంగా క్రీడాపోటీలను శుక్రవారం నిర్వహించారు. కాశీబుగ్గ బ్లాక్ స్థాయిలో పలాస, వజ్రపుకొత్తూరు, మెళియాపుట్టి మండలాల క్రీడాకారులకు వంద మీటర్ల పరుగు పందెం, కబడ్డీ, వాలీబాల్ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభ సమావేశంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం టి.చిట్టిబాబు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పి.చిరంజీవులు, రాష్ట్ర పీఈటీ సంఘ సంయుక్త కార్యదర్శి పి.తవిటయ్య, డిగ్రీ కళాశాల పీడీ టి.మధు తదితరులు పాల్గొన్నారు.

# 'నిష్పక్షపాతంగా అధ్యయనం చేయాలి'

కంచిలి: ఇచ్ఛాపురం నియోజకవర్గంలో బెంతు ఒరియాల విషయంపై ఏకసభ్య కమిషన్ నిష్పక్షపాతంగా అధ్యయనం చేయాలని, రాజకీయ నేతలతో కలిసి పర్యటించడం సరికాదని జిల్లా ఆదివాసీ సంఘాల ఐక్య పోరాట సమితి ప్రతినిధులు ఆరోపించారు. ఈ మేరకు మండల కేంద్రంలో విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. ముందుగా స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఏకసభ్య కమిషన్ పర్యటించే సమయంలో రాజకీయ నాయకుల ప్రమేయం ఉండకూడదన్నారు. సమావేశంలో జిల్లా జేఏసీ అధ్యక్షుడు ఎస్.రాంబాబు, ప్రధాన కార్యదర్శి జి.అప్పన్న, గౌరవ అధ్యక్షుడు సవర జగన్నాయకులు, మందస మండల ఆదివాసీ వికాస్ పరిషత్ కోశాధికారి ఎస్.విజయ్, ఏఐఏఈఎఫ్ సభ్యుడు పురేంద్రసబర, చిరంజీవి, మదన్‌మోహన్ పాయికో తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నేతలు

### విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: ఇటీవల చోడవరంలో జరిగిన 66వ రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లా విద్యార్థులు సత్తాచాటారు. మెట్టూరు గ్రామానికి చెందిన మౌనిక, గ్రీష్మ ద్వితీయ స్థానం, కాశీబుగ్గకు చెందిన మణికంఠ, దేవీశ్రీప్రసాద్‌లు తృతీయ స్థానం సాధించారు. దీంతో వీరిని పలాసలోని క్యాంప్ కార్యాలయంలో మంత్రి సీదిరి అప్పలరాజు శుక్రవారం అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

### కేసుల పరిష్కారానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న జడ్జి హరిప్రియ

కోటబొమ్మాళి: ఫిబ్రవరి 11వ తేదీన జరగనున్న లోక అదాలత్‌లో ఎక్కువ కేసుల పరిష్కారానికి బ్యాంక్ అధికారులు, పోలీసులు, న్యాయవాదులు కృషి చేయాలని నరసన్నపేట జూనియర్ సివిల్ జడ్జి సి.హరిప్రియ అన్నారు. స్థానిక కోర్టులో బ్యాంకు అధికారులతో లోక్ అదాలత్‌పై సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏజీపీ సంపతిరావు తిరుపతి, న్యాయవాదులు లఖినేని శ్రీనివాస్, పి.అర్జునరావు, వి.అప్పలనాయుడు, యు.తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

### ఆర్థిక సాయం అందజేత

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని నీలావుట్టుగ గ్రామానికి చెందిన మజ్జి సంతోషి అనే యువతి గత కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బంది పడుతోంది. దీంతో ఆమెకు మెరుగైన వైద్యం కోసం బెహరాన్‌లో పనిచేస్తున్న కూలీలు శుక్రవారం రూ.5,000ల ఆర్థిక సాయం శుక్రవారం అందజేశారు. మరింతమంది దాతలు ముందుకు రావాలని కోరారు.

### మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్టు

కోటబొమ్మాళి: మండలంలోని నీలంపేటకు చెందిన లాడి మల్లేశ్వరరావు అక్రమంగా 20 మద్యం బాటిళ్లను తరలిస్తూ పట్టుబడ్డాడు. శుక్రవారం మద్యం తరలిస్తుండగా కాపుకాసి అతడిని పట్టుకొని అరెస్టు చేసి, నరసన్నపేట కోర్టులో హాజరుపరిచినట్లు కోటబొమ్మాళి ఎస్ఈబీ సీఐ నాగవేణి, ఎస్ఐ డి.ప్రభాకరరావు తెలియజేశారు.

# జీవో నంబర్ 1పై రాజకీయాలు హేయం

● పిరియా సాయిరాజ్

కవిటి: ప్రజా శ్రేయస్సు దృష్ట్యా ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్-1పై టీడీపీ నాయకులు రాజకీయాలు చేయడం హేయమని వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ అన్నారు. మండలంలోని బల్లిపుట్టుగలో ఉన్న తన స్వగృహంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కందుకూరు ఘటన నేపథ్యంలో రాజకీయ పార్టీలు ఇరుకు రోడ్లపై నిర్వహించే రోడ్‌షోలపై ప్రభుత్వం నిషేధం విధించిందన్నారు. దీనిని టీడీపీ నాయకులు రాజకీయ నేతల పర్యటనల కోణంలోనే చూస్తూ ప్రజల ప్రాణాలను లెక్కచేయనివైనం దురదృష్టకరమన్నారు. ఇది ఏ ఒక్కరికో ఉద్దేశించిన జీవో కాదనే విషయం తెలుసుకోవాలని సూచించారు. బెంతొరియాలను రాజకీయ అవసరాల కోసమే వాడుకున్న టీడీపీ నాయకులు, మరలా బెంతొరియాల నామస్మరణ చేస్తుండడం దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లు ఉందన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పీఎం తిలక్, మండల పార్టీ కన్వీనర్ కడియాల ప్రకాష్, వైస్ ఎంపీపీ పి.నేతాజీ, వై.నీలయ్య, ఎస్‌పీ నారాయణస్వామి, పినింటి ప్రభాకర్, జల్లు నరేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పిరియా సాయిరాజ్

# మహిళల ఆరోగ్య భద్రతకు కృషి

మందస: మహిళలు ఆరోగ్యం ఉండడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని సెర్ప్ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ గొడబ ప్రసాదరావు అన్నారు. మందసలో శుక్రవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ గర్భిణులు, కిశోర బాలికలకు పౌష్టికాహారం ఇవ్వడం జరుగుతోందన్నారు. రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. స్థానికంగా లభించే మునగాకు, రాగిపిండి, పండ్లు, కూరగాయలు, చిరుధాన్యాలపై అంగన్‌వాడీ, ఆశ, ఏఎన్‌ఎంలు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం వీవో, సీసీలతో జరిగిన సమావేశంలో కల్యాణ మస్తు పథకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య ప్రతినిధులు సవర కాంతమ్మ, బాలక విజయశ్రీ, సీసీలు చిచ్చుల కిషోర్, జమ్మా శ్రీనివాసరావు, ముఖలింగం, తేజ, కూర్మారావు, గణపతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీఎం ప్రసాదరావు

### సజావుగా సర్వసభ్య సమావేశం

సంతబొమ్మాళి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మెరుగు రాజేశ్వరి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం సజావుగా శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దండుగోపాలపురం ప్రభుత్వ భూమిలో జగనన్న లేఅవుట్ ఏర్పాటు చేస్తే కొందరు తప్పుడు పత్రాలను చూపి కోర్టులో ఉందని అడ్డుకున్నారని సర్పంచ్ ఎం.అశోక్ చక్రవర్తి, పీఏసీఎస్ డైరెక్టర్ ఎం.నాగభూషణరావు సభ దృష్టికి తీసుకొచ్చారు. లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన సరిహద్దు రాళ్లలను, ప్రభుత్వ బోర్డును తొలగించారని తెలిపారు. అప్పటటి సబ్ కలెక్టర్ వికాస్ మర్మట్ చెప్పినా మండల రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని మండిపడ్డారు. ఏవో కారణాలు చెప్పి మూడున్నర సంవత్సరాలుగా తిప్పుతున్నారన్నారు. అలాగే ఉమిలాడ, కాకరాపల్లి, ఉద్దంపాలెంలో కూడా లేఅవుట్ వేయకపోవడంపై రెవెన్యూ అధికారులను నిలదీశారు. గొదలాంలో అంగన్‌వాడీ కేంద్రం పూర్తైనా కాంట్రాక్టర్ ఇంతవరకు అప్పగించలేదని, అందులో గొర్రెలను, మేకలను ఉంచుకుంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పాల వసంతరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు, వైస్ ఎంపీపీ నక్క చింతామణి, ఎంపీడీవో ఉమాసుందరి తదితరులు పాల్గొన్నారు.



అధికారులను నిలదీస్తున్న జెడ్పీటీసీ వసంతరెడ్డి తదితరులు

### మంత్రి సీదిరి పరామర్శ

మందస: మండలంలో ఇటీవల మరణించిన పలువురి కుటుంబాలను మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు శుక్రవారం పరామర్శించారు. పెద్దబిడిమి గ్రామానికి చెందిన దున్న జగ్గారావు, నల్లబొడ్లూరుకు చెందిన లబ్బ నారాయణమ్మ, తెలుకుల సుభద్ర, పల్లెబహడపల్లికి చెందిన బత్తిన సన్యాసి, హరిపురానికి చెందిన కొర్ర లక్ష్మీనారాయణ(లచ్చు) కుటుంబాలను పరామర్శించి సంతాపం తెలిపారు. ఆయనతో పాటు ఎంపీపీ డొక్కరి దానయ్య, సరియాపల్లి సర్పంచ్ బత్తిని వెంకటరావు, కొర్ర హరినారాయణ, వైకుంఠరావు, ఆనందరావు, పార్టీ నాయకులు బొడ్డు ఉమాపతి, మామిడి తులసయ్య, మామిడి కృష్ణారావు, సార దూర్వాసులు తదితరులు ఉన్నారు.